క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఏఎంసీ చైర్మన్



మద్దూరు: కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు, నాయకులు రఘుపతిరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌ను హైదరాబాద్‌లో కలిశారు. పట్టణ అభివృద్ధితో పాటు రోడ్డు విస్తరణ పనులు వేగవతం చేసి పనులు పూర్తి చేయాలని కోరినట్లు ఏఎంసీ చైర్మన్ తెలిపారు. ఇందుకు సీఎం సానుకులంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

బాల్య వివాహంపై ఫిర్యాదు

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లి వీరభద్రేశ్వర ఆలయంలో గత నెల 8న బాల్య వివాహం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు మంగళవారం పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజు వివరాల ప్రకారం.. మండలంలోని క్యాతన్‌పల్లి కి చెందిన ప్రసాద్ కర్ణాటక రాష్ట్రం మోద్నే గ్రామానికి చెందిన 16 వయస్సున్న నాగేంద్రమ్మతో వివాహం జరిపించారు. ఈ విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించిన వారిపై కేసును మోదు చేసి బాలికను ఐసీడీఎస్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

సర్వే డబ్బులు అందజేయాలి



మాగనూర్: రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, పల్స్‌పోలియో సర్వే డబ్బులు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం వారు స్థానిక డాక్టర్ నాగజ్యోతికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. సర్వేల డబ్బులు చెల్లించిన తర్వాతనే డిసెంబర్ 02 నుంచి చేపట్టె లెప్రసీ సర్వేను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు శాంతమ్మ, గౌరమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నాయకులు ఉచితంగా నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్, వెంకటేష్, కృష్ణా నాయకులు భీమశంకర్, మాళప్ప, రంగప్ప, తిమ్మయ్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మద్దూరు: మండలంలోని లబ్ధిదారులకు సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పీఏసీఎస్ కార్యక్రమంలో చైర్మన్ నర్సింహా, కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఒక్క నెలలోనే దాదాపు రూ.13లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 10మందికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పిల్లినర్సింహ, వెంకట్‌రెడ్డి, మనివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రం యాద్గిర్ ప్రధాన రోడ్డుపై ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీలు విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక యమహా ద్విచక్ర వాహనంపైన స్ప్లెండర్ నంబర్ వేసుకొని నడుపుతున్న వ్యక్తిని గుర్తించి కేసునమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక వాహనంపై మరొక వాహనం నంబర్ వేసుకొని నడపటం నేరమని తెలిపా రు. అదేవిధంగా వాహనాలకి అధిక శబ్దాలు వచ్చే వేరే సైలెన్సర్లను వాడిన నంబర్ ప్లేట్ల స్థానంలో ఇతరత్రా రాతలు రాసిన అట్టి వాహనాలను సీజ్‌చేసి చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు.

బడుగుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



కృష్ణాలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణా: కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటామని, రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఏకకాలంలో పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తమ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని తంగిడిలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజప్పగౌడ, శివ, సుదర్శన్, అంజప్పగౌడ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

మండలంలోని తంగిడి, కుసుమర్తి గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం ఆయా గ్రామాల విద్యార్థులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందించారు. ఈ విషయంపై డీపో మేనేజర్‌తో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేస్తామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

మాగనూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సమీపంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి భూమిపూజ చేశారు. ఎంజీఎన్‌ఆర్‌జీఎస్ నిధుల నుంచి రూ.12లక్షలతో అంగన్‌వాడీకోసం భవనం నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం అక్కడే ఉన్న లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి చెందాలంటే కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. సీడీపీఓ సరోజిని, సూపర్‌వైజర్ అక్కమ్మ, ఆనంద్‌గౌడ్, దండు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నర్వ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 10:గంటలకు అంబులెన్స్‌ను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ తెలిపారు. లబ్ధిదారులకు అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ, 11గంటలకు యాంకిలో సీసీటీవీ కెమెరాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

ఆరు గ్యారంటీలపై కళాజాతా ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మద్దూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై మంగళవారం మండలంలోని మోమినాపూర్, రెనివట్ల, జాదరావ్‌పల్లి గ్రామాల్లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ, రూ.500 గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత కరెంట్, రైతులకు రూ.500బోనస్ తదితర అంశాలను ఆటపాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి కళాకారులు రవిశంకర్, కిరణ్, నర్సింహ, బాలయ్య, లక్ష్మి, ఆరుణజ్యోతి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి



సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఉద్యోగులు

నారాయణపేట రూరల్: రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మనోహర్‌గౌడ్ డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల పదవి విరమణ పొందిన ఉద్యోగస్తులకు గ్రాట్యూటీ విడుదల చేయాలని కోరారు. పదవీ విరమణ పొందిన వారికి హస్పిటల్‌లో ఉచితంగా వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. నాయకులు సూర్యప్రకాష్, జయతీర్థ, బాలరాజ్, ఏంఎస్ కుమార్, తమ్మళి సత్యనారాయణ, చందులాల్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ జాతర



జల్దిబిందెతో ప్రదక్షిణచేస్తున్న భక్తులు

మరికల్: మండలంలోని తీలేర్‌లో ఎల్లమ్మ దేవత జాతరను మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గ్రామ శివారులోని బావి నుంచి జల్దిబిందెను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారిని పట్టు వస్త్రాలు, అభరణాలతో అలంకరణాలు చేయగా ప్రశాంత్ రెడ్డి, దీపిక దంపతులచే బ్రాహ్మణులు పూజలు చేయించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండన్న, రాజు, రవి, రాములు, ఆనంతయ్యగౌడ్, కుర్మన్న, నర్సింహులు, బాలప్ప, మల్లప్ప, కృష్ణమురళి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్‌కు 13మంది శిక్షణ పోలీసులు



ట్రైని కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న సీఐ శివశంకర్

నారాయణపేట రూరల్: నారాయణపేట సర్కిల్‌కు 13మంది కొత్తగా శిక్షణ కానిస్టేబుల్స్ కేటాయించారు. దీంతో వారు మంగళవారం సీఐ శివశంకర్‌ను కలుసుకోగా, వారిలో ఐదు గురు టౌన్ పీఎస్‌కు, నలుగురు రూరల్ పీఎస్‌కు, మరో నలుగురు దామరగిద్దకు కేటాయించారు. అనంతరం ఆయన వారితో మాట్లాడి విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి క్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ నూతన సాంకేతిక వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రాముడు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



2కే రన్‌లో పాల్గొన్న చైర్ పర్సన్‌గందె అనసూయ, కమిషనర్ సునీత

నారాయణపేట రూరల్/కోస్గి: ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్న సందర్భంగా ఈనెల 1 నుంచి ప్రారంభమైన ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా జిల్లాలోని నారాయణపేట, కోస్గి, మక్తల్ మున్సిపాలిటీ కేంద్రాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మహిళా సంఘాల సభ్యులు 2కె రన్‌తోపాటు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపాలిటీలో 2కె రన్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ, కమిషనర్ సునీత జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు స్థానిక కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు పట్టణ ప్రధాన రోడ్డు గుండా శ్రీ సత్యనారాయణ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ కార్మికులను ఘనంగా సన్మానించారు.

ఉచిత పశువైద్య శిబిరం



దోరేపల్లిలో మందులు అందజేస్తున్న పశువైద్య సిబ్బంది

మద్దూరు: మండలంలోని దోరేపల్లిలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 135పశువులకు ఈ పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు సబిత, శ్రీనివాస్, విశాల, సిబ్బంది అరుణ, సూపర్‌వైజర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డిలో మంగళవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. పశువైద్య అధికారి సిద్దార్థ మాట్లాడుతూ గ్రామాల్లో పశువుల్లో గర్భకోశ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను రైతులకు వివరించారు. అనంతరం పశువులకు టీకాలు వేశారు. ఇందులో సిబ్బంది ఉత్తేజ్ లింగప్ప, రామకృష్ణ, గోపాల మిత్ర కుమార్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు. వంట సరుకులను పరిశీలించారు. తాజా కూరగాయలతో వంట వండాలని, స్వచ్ఛమైన నీటిని అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసారావు, హెచ్‌ఎం కుసుమకుమారి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

నర్వ: మండంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఎన్‌ఆర్-15048 విత్తనాలు 100 బస్తాలు, అందుబాటులో ఉండగా 15కేజీ కలిగిన బస్తా ధర రూ.700, కేఎన్‌ఎం-1638 రకం 15కేజీ బస్తా ధర రూ. 603, కెఎన్‌ఎం 1638 101బస్తాలు, ప్రాథమిక సహకార కేంద్రంలో అందుబాటులో ఉందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేటి నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

కొత్తపల్లి: మండలంలోని అల్లిపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు కొనసాగనున్నాయి. రెండురోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 4న గణపతి నవగ్రహ పూజ, అఖండ దీపారాధన, అలాగే 5న హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని నాయకులు కొత్తమాలె రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి రానున్నారని అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేయాలని వినతి

కృష్ణా: మాగనూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో పాటు మరో ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎంఈఓ నిజాముద్దీన్, జీహెచ్‌ఎంలు గణేష్‌సింగ్‌తోపాటు ఇతర ఉపాధ్యాయులు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

గుట్కా పాకెట్ల పట్టివేత

కోస్గి: పట్టణంలోని రామాలయం సమీపంలో ఉన్న ఓ కిరాణం దుకాణంలో పోలీసులు దాడి చేసి గుట్కా పాకెట్లు పట్టుకున్నారు. పలు దుకాణాల్లో జోరుగా విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో పక్కా సమాచారంతో పోలీసులు సోమవారం రాత్రి దుకాణంపై దాడి చేయగా రూ.30వేల విలువైన గుట్కా పట్టుబడింది. ఈ సంఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో రైతుల పరేషాన్

అమరచింత: తుఫాన్ ప్రభావంతో కల్లాల వద్ద ధాన్యం ఆరబోసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల నుంచి వాతవరణం చల్లబడటం, తేలిక పాటి జల్లులు కురుస్తుండడంతో వరి ధాన్యం తేమశాతం పెరుగుతుండడంతో ధాన్యం కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. వరికుప్పలపై ప్లాస్టిక్ సంచులను కప్పి ఉంచుతున్నారు. సన్నాలకు ప్రభుత్వం బోనస్ అందిస్తుండటంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి కొనుగోళ్లను చేపట్టి రైతు ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మాగనూర్‌లో..

ధన్వాడ: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఎంఈఓ గాయత్రి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో దివ్యాంగుల విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యయులు శ్రీనివాస్‌సాగర్, రాకేష్‌కుమార్, ప్రసాద్, రాఘవేందర్‌నాయుడు, నారాయణ పాల్గొన్నారు.

మరికల్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులు గ్రామ పూర్వ విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంఈఓ మనోరంజిని మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమంకోసం వివిధ సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు..

మాగనూర్: దివ్యాంగులను చిన్న చూపు చూడొద్దని ఐఈఆర్‌పీ తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. దివ్యాంగులు అత్యున్నతస్థాయి అందుకోవడానికి వారి అంగవైకల్యాన్ని జయించొచ్చని చెప్పారు. అంతకుముందు విద్యార్థులచే ప్రధాన రోడ్డు వెంబడి ర్యాలీ నిర్వహించారు. సీఓ స్వప్న, సీఆర్‌పీ కృష్ణయ్య, ఎల్లాగౌడ్, ఉపాధ్యాయులు బలరాం, రాకేష్, నీరజ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలుచేయాలి



గోదాంను పరిశీలిస్తున్న ఏఈఓలు

మద్దూరు: యాసంగి సీజన్‌లో రైతులు విత్తన లైసెన్స్ కలిగిన విత్తన డీలర్ల నుంచే తగిన రసీదు పొంది మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలో ఎరువులు, విత్తనాలు దుకాణాలను, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాములను ఆయన తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన, గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలను మాత్రమే విక్రయించాలని డీలర్లకు ఆదేశించారు. నంబర్, తయారి తేది, డీలర్, సంతకం ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చైర్మన్ నర్సింహ, ఏఈఓలు రమేష్‌నాయక్, రేష్మ, శ్రావణ్‌కుమార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా 66 మోసాలు చేసిందని బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ప్రభుత్వం ప్రజల మనుసును మళ్లించేందుకు విజయోత్సవాలు జరుపుకుంటున్నారని అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, 50వేల ఉద్యోగాలు ఇచ్చామని పచ్చి అబద్దాలు చెబుతుందన్నారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేకుండా పోయిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పడుతున్న ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలియడం లేదని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్‌రెడ్డి, కనకరాజు, ప్రసన్నరెడ్డి, బాల్‌రాంరెడ్డి, జయరాంరెడి, రాంమాదవ్, యాదిరెడ్డి, రాఘవేందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు సరికాదు..



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాంబాబు

నారాయణపేట రూరల్/ టౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు సరికాదని హిందు ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ప్రతినిధిని అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా బుధవారం జిల్లా కేంద్రంలో హిందు ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని హిందు వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు స్వచ్ఛందంగా మూసివేసి రెండు గంటలు ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నిరసన ర్యాలీ సుభాష్ రోడ్డు అవధూత్ మఠం నుంచి ప్రారంభమై శ్రీసత్యనారాయణ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మధన్ మోహన్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి ప్రవీణ్, శివరాజ్, అయ్యప్ప సేవ సమితి జిల్లా అధ్యక్షులు కాకర్ల భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష



నిరసన దీక్ష చేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: ఉమ్మడి మద్దూరు మండలం భూనీడు పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని చేపట్టిన నిరసన దీక్ష మంగళవారానికి రెండో రోజుకి చేరుకుంది. ఈ సందర్భంగా నేడు ఆటో యూనియన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కొత్తపల్లి మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ భవనాలను అన్ని వసతులు ఉన్న భూనీడులో కొన్ని కార్యాలయాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణయ్యగౌడ్, కతాల్, కిష్టప్ప, బొందెల రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందాం

అమరచింత: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని రెండో వార్డులో గల పోచమ్మ ఆలయం వెనక పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని గుర్తించి అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. శుభ్రపరిచిన ప్రదేశంలో రంగురంగుల ముగ్గులను వేస్తూ పూలతో అలంకరించారు. అనంతరం డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని ఆయా వార్డుల్లోని ప్రజలు తమ ఇళ్ల ముందున్న వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం, మున్సిపల్ మేనేజర్ ఈసుప్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రపరిచి రంగులతో ముగ్గులు వేసిన మున్సిపల్ సిబ్బంది